# పాలకుర్తి వాణి

మన పల్లె.. మన ముచ్చట్లు

సంపుటి : 01 | సంచిక : 211 | వరంగల్ | మంగళవారం, 12 మే 2026 | పేజీలు : 02




## ఏసీబీకి చిక్కిన కొమురవెల్లి పంచాయతీ కార్యదర్శి

- రూ.10 వేల లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న ఏసీబీ అధికారులు

2 లో

# తెలంగాణ మహిళా కమిషన్ చైర్ పర్సన్‌గా గద్వాల విజయలక్ష్మి

- కమిషన్ సభ్యులుగా చాకలి ఐలమ్మ మనవరాలు శ్వేత, కాసోజు శంకరమ్మ







**పాలకుర్తి వాణి, హైదరాబాద్ :** తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర మహిళా కమిషన్‌కు కొత్త నియామకాలు చేపట్టింది. మహిళా హక్కుల పరిరక్షణ, మహిళా సంక్షేమ కార్యక్రమాల పర్యవేక్షణ కోసం కీలకమైన తెలంగాణ మహిళా కమిషన్‌కు చైర్ పర్సన్‌గా గద్వాల విజయలక్ష్మిని నియమించింది. అలాగే కమిషన్ సభ్యులుగా ప్రభుత్వం పలువురు ప్రముఖ మహిళలకు అవకాశం కల్పించింది. ఈ నియామకాల్లో తెలంగాణ ఉద్యమం, సామాజిక సేవ, మహిళా హక్కుల ఉద్యమాల్లో పనిచేసిన వారికి ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలుస్తోంది.

**శ్రీకాంతచారి తల్లి కాసోజు శంకరమ్మకు అవకాశం..**

తెలంగాణ ఉద్యమంలో అమరుడైన శ్రీకాంతచారి తల్లి కాసోజు శంకరమ్మను మహిళా కమిషన్ సభ్యురాలిగా రేవంత్‌రెడ్డి సర్కార్ నియమించింది. తెలంగాణ ఉద్యమ సమయంలో శ్రీకాంతచారి త్యాగం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే. ఈ నియామకంతో తెలంగాణ ఉద్యమ కుటుంబాలకు ప్రభుత్వం గౌరవం ఇచ్చినట్లయిందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

**చాకలి ఐలమ్మ మనవరాలు..**

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ మనవరాలు జనగాం జిల్లా పాలకుర్తికి చెందిన చిట్యాల శ్వేతను కూడా కమిషన్ సభ్యురాలిగా కాంగ్రెస్ సర్కార్ నియమించింది. చాకలి ఐలమ్మ తెలంగాణ రైతాంగ పోరాట చరిత్రలో కీలక వ్యక్తిగా గుర్తింపు పొందారు. ఆమె కుటుంబానికి ఈ నియామకంతో ప్రాధాన్యం సంతరించుకుంది.

**మరికొంత మందికి సభ్యులుగా అవకాశం..**

మహిళా కమిషన్ సభ్యులుగా శశికళ యాదవ్ రెడ్డి, సదాలక్ష్మి, రాధాభాయి, ఉజ్మా షకీరాలను కూడా తెలంగాణ ప్రభుత్వం నియమించింది. వివిధ సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించేలా ఈ నియామకాలు చేపట్టినట్లు తెలుస్తోంది. ఈ నియామకాల్లో తెలంగాణ ఉద్యమానికి సంబంధించిన కుటుంబాలకు అవకాశం కల్పించడం విశేషంగా మారింది. శ్రీకాంతచారి కుటుంబం, చాకలి ఐలమ్మ వారసులకు ప్రాధాన్యం ఇవ్వడం ఉద్యమ చరిత్రను గుర్తు చేసిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



## నాణ్యమైన అందించడమే లక్ష్యం

- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**పాలకుర్తి వాణి, జనగామ :** విద్యార్థుల భవిష్యత్‌కు నాణ్యమైన విద్యే బాట అని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మే 11 నుంచి 17 వరకు చేపట్టిన విద్యా వారోత్సవాల సందర్భంగా సోమవారం, జిల్లాలోని బచ్చన్నపేట మండల పరిధిలో గల కేజీబీవీలో నిర్వహిస్తోన్న వేసవి శిబిరాన్ని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సందర్శించారు. ఈ సందర్భంగా శిబిరంలో పాల్గొన్న బాలికలతో కలెక్టర్ ఆప్యాయంగా ముచ్చటించారు. విద్యార్థినుల అభిరుచులు, నేర్చుకుంటున్న అంశాల గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజూ కొద్దిసేపు సమయం కేటాయించి, విద్యార్థినులకు స్పీడ్ మ్యాథ్స్ నేర్పిస్తానని కలెక్టర్ తెలిపారు. వేసవి సెలవులను జీవితాంతం గుర్తుండిపోయే అద్భుత అనుభవాల సమాహారంగా రూపకల్పన చేశామని కలెక్టర్ పేర్కొన్నారు. సమ్మర్ క్యాంప్‌లో పొందుపరిచిన ప్రతి అంశాన్ని ఆసక్తిగా నేర్చుకోవాలని, తమకు ప్రత్యేకంగా నచ్చిన రంగంలో నైపుణ్యం సాధించి, వివిధ పోటీల్లో ప్రతిభ కనబరచాలని విద్యార్థినులకు సూచించారు.


# WANTED విలేకరులు కావలెను

పాలకుర్తి వాణి దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫర్లు, మండల విలేకరులు కావలెను. తెలుగు భాషపై పట్టు, ప్రజా సమస్యలు, సమకాలీన రాజకీయాలపై అవగాహన ఉండి.. రాయగల వారికి ఇదే మా ఆహ్వానం..

9866366702, 9963261745



పాలకుర్తి వాణి

2

epaper.palakurthivani.com

మన పల్లె.. మన ముచ్చట్లు | మంగళవారం, 12 మే 2026





# ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

**జనగామ, పాలకుర్తి వాణి:** ప్రజావాణిలో వివిధ సమస్యలతో వచ్చే ప్రజల అర్జీలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ ఫిర్యాదులను స్వీకరించి, పరిశీలించారు. 190 అర్జీలను కలెక్టర్ స్వీకరించారు. వచ్చిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు కేటాయిస్తూ, ప్రజా సమస్యలపై తగిన చర్యలు తీసుకొని, త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేయాలని అధికారులకు సూచించారు. ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో వేగం పెంచాలని, పెండింగ్ లో లేకుండా దరఖాస్తులను ఎప్పటికప్పుడు పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ ప్రజావాణిలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోమ్, జెడ్పీ సీఈవో రంగా రావు, జనగామ మునిసిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి, సీపీఓ చిన కోట్యా నాయక్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# ఈ ఆఫీస్‌లోనే అన్ని ఫైళ్లు

- **డీఈఓ కార్యాలయంలో అన్ని సెక్షన్ల పరిశీలన**
- **జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

జనగామ, పాలకుర్తి వాణి: ఈ ఆఫీస్‌లోనే అన్ని ఫైళ్ల నిర్వహణ ఉండాలని జిల్లా కలెక్టర్, విద్య శాఖ అధికారి సందీప్ కుమార్ ఝా పేర్కొన్నారు. సోమవారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మొదటి అంతస్తులో గల జిల్లా విద్యా శాఖ అధికారి (డీఈఓ) కార్యాలయాన్ని కలెక్టర్ సందర్శించి, ఆకస్మికంగా తనిఖీ చేశారు. అన్ని సెక్షన్లను పరిశీలించి, సిబ్బంది పనితీరు, సెక్షన్ ల నిర్వహణ, ఫైళ్ల నిర్వహణ విధానంపై ఆరా తీశారు.





## ఇండ్ల గణనకు ప్రజలు సహకరించాలి

**సర్పంచ్ పెద్ది కృష్ణమూర్తి గౌడ్**

**పాలకుర్తి వాణి, దేవరుప్పల :** తెలంగాణ రాష్ట్రంలో జనగణన 2027లో భాగంగా 11-05-2026 నుండి 09-06-2026 వరకు ఇండ్ల గణన (హౌస్ లిస్టింగ్ &హౌసింగ్ సెన్సస్) జరుగుతోంది.అందులో భాగంగానే దేవరుప్పుల మండలకేంద్రంలో సంబంధిత గణాంకాధికారులు మొదటి దశలో ఇళ్ల వివరాలను,సౌకర్యాలను నమోదు చేస్తున్నారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పెద్ది కృష్ణమూర్తి గౌడ్ మాట్లాడుతూ మొదటి దశలో ఇండ్ల వివరాలను నమోదు చేస్తారని, తదుపరి జనగణన 2027 ఫిబ్రవరిలో జరుగుతుందని,ఈ గృహ జాబితాలో ఇళ్ల పరిస్థితులు, ఆస్తులు, మౌలిక సదుపాయాల (నీరు, విద్యుత్, టాయిలెట్) సమాచారం సేకరిస్తారని, అధికారులు అడిగే ప్రశ్నలకు ప్రజలు వారికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ ధర్మ సతీష్ రెడ్డి, సూపర్ వైజర్ మదన్ మోహన్ రెడ్డి, ఎన్యుమరేటర్లు రాజన్న, స్వప్న, లలిత, వెంకటేష్, చంద్రశేఖర్,తదితరులు పాల్గొన్నారు.

## ఏసీబీ వలలో కొమురవెల్లి పంచాయతీ కార్యదర్శి

**రూ.10 వేల లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న ఏసీబీ అధికారులు**

**పాలకుర్తి వాణి, సిద్దిపేట :** సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండల కేంద్రంలో సోమవారం అవినీతి నిరోధక శాఖ (ACB) అధికారులు మెరుపు దాడి నిర్వహించి, లంచం తీసుకుంటుండగా పంచాయతీ కార్యదర్శి మరియు సర్పంచ్ భర్తను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర సంచలనం సృష్టించింది. ఏసీబీ అధికారుల వివరాల ప్రకారం.. కొమురవెల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ప్లాట్‌లో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో డ్రైనేజీ పైప్‌లైన్ ఏర్పాటు చేశారు. ఆ పైప్‌లైన్‌ను తొలగించేందుకు సంబంధించిన అధికారిక ప్రక్రియ పూర్తి చేయడానికి పంచాయతీ కార్యదర్శి గడ్డం రాజు గౌడ్ (AO1) రూ.10 వేల లంచం డిమాండ్ చేసినట్లు తెలుస్తోంది. దీనిపై బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించడంతో, అధికారులు పక్కా ప్రణాళికతో నిఘా ఏర్పాటు చేశారు. సోమవారం సాయంత్రం సుమారు 4.40 గంటల సమయంలో గ్రామ పంచాయతీ కార్యాలయంలోనే లంచం డబ్బులు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దాడి నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి సూచనల మేరకు సర్పంచ్ గొల్లపల్లి పద్మ భర్త గొల్లపల్లి అంజనేయులు (A2) రూ.10 వేల నగదును స్వీకరిస్తుండగా అధికారులు పట్టుకున్నారు. అధికారులు వారిద్దరినీ అదుపులోకి తీసుకుని, లంచం సొమ్మును స్వాధీనం చేసుకున్నారు.

**ప్రత్యేక కోర్టులో హాజరు**

విధి నిర్వహణలో అవినీతికి పాల్పడి అనుచిత లబ్ధి పొందేందుకు ప్రయత్నించినందుకు గాను పంచాయతీ కార్యదర్శి రాజు గౌడ్, సర్పంచ్ భర్త అంజనేయులును అధికారులు అరెస్టు చేశారు. వారిని హైదరాబాద్‌లోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరచనున్నట్లు అధికారులు వెల్లడించారు. కేసుపై తదుపరి దర్యాప్తు కొనసాగుతోంది.


**1064కు ఫిర్యాదు చేయండి.**

ఏ ప్రభుత్వ ఉద్యోగి అయినా లంచం డిమాండ్ చేస్తే వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ 1064కు ఫిర్యాదు చేయాలని ఏసీబీ అధికారులు ప్రజలను కోరారు. ఫిర్యాదుదారుల వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ దాడిలో ఏసీబీ ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# నూతన వధూవరులకు ఆశీర్వాదం

**పాలకుర్తి వాణి, జనగామ :** జనగాం జిల్లా పాలకుర్తి ZPSS పాలకుర్తి పాఠశాల SSC 94-95 బ్యాచ్ పూర్వ విద్యార్థి బొబ్బిశెట్టి ఉషా రాణి, రాజశేఖర్ దంపతుల కుమారుడు చి. రాకేష్ వివాహము లావణ్యతో జరుగగా రిసెప్షన్ వేడుకలు జనగామ భ్రమరాంబిక గార్డెన్లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీనియర్ జర్నలిస్టు కమ్మగాని రమేష్ గౌడ్, సునీత దంపతులు, పూర్వ విద్యార్థులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. పూర్వ విద్యార్థులు ముత్తినేని సత్యం, పులి గణేష్ గౌడ్, ఎండి జమాల్, తందూరి రమేష్, రాపాక రమేష్, గాంధారి సంపత్, నాయిని ఎల్లారెడ్డి, కత్తుల సోము యాదవ్, వడిచెర్ల వెంకటేశ్వర్లు, బండి భగవంత్ గౌడ్,గూగుల్ లోతు వెంకన్న, శోభ, పుష్ప,ఈ రిసెప్షన్ కార్యక్రమంలో పాల్గొన్నారు.



Printed and Published by **DHEERAVATH SREENU NAIK** on behalf of DHEERAVATH SREENU NAIK, Printed at SHASHI PRINTING PRESS Flat No.58675/9/6, Ashok Nagar, Kamareddy, Tela gana, 503111., Published at 4-109/3, Palakurthy, Jangaon District. Telangana , 506252, editor DHEERAVATH SREENU NAIK. Ph : **9866366702**, RNI: TGTEL/25/A2341